పచ్చిరొట్టతో పంటకు మేలు


పచ్చిరొట్ట పైర్ల సాగుకు సిద్ధం చేసిన దుక్కులు


ముక్తేశ్వరం ఆర్‌బీకేలో పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఏవో ఎస్‌వీపీ కుమారి

- వ్యవసాయ పనులకు రైతుల సమాయత్తం
- 50 శాతం సబ్సిడీపై మండలానికి 110 క్వింటాళ్ల విత్తనాలు
- భూసారాన్ని పెంచుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

బల్లికురవ: తొలకరి వర్షాలు కురుస్తుటంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమవుతున్నారు. మెట్ట–మాగాణి భూములు దుక్కులు దున్ని ఖరీఫ్ ఆరంభ పైర్ల సాగుకు సిద్ధంగా ఉంచారు. భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట పైర్లయిన జీలుగ, జనుము, పిల్లిపెసర సాగుకు ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సమకూర్చుకుని సిద్ధం చేసుకున్నారు. పశుసంతతి గ్రామాల వారీగా తగ్గిపోవటం వల్ల పొలాలకు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గింది. గతంలో ఎకరాకు 5 నుంచి 7 ట్రక్కుల వరకు పశువుల ఎరువు తోలేవారు. నేడు ఆ పరిస్థితులు లేవు. రసాయనిక ఎరువుల వాడకం పెరిగింది. రసాయనిక ఎరువులు విచక్షణ రహితంగా పోటీపోటీగా వాడకంతో భూమి నిస్సారమవుతోంది.

110 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు..

పచ్చిరొట్ట పైర్ల సాగుకు మండలానికి 40 క్వింటాళ్ల జీలుగ, 40 క్వింటాళ్ల జనుము, 30 క్వింటాళ్ల పిల్లిపెసర 50 శాతం సబ్సిడీపై కేటాయించారు. మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తన కిట్లు అందజేస్తున్నారు. జనుము, జీలుగ రాయితీపోను కిలో రూ. 44, పిల్లిపెసర రూ. 67 అందజేస్తున్నారు.

పచ్చిరొట్ట పైర్లతో ఉపయోగాలు..

పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూమి భౌతిక స్థితి మెరుగుపడి నీటిని పోషకాలు నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందని వ్యవసాయాధికారిణి ఎస్వీపి కుమారి తెలిపారు. పచ్చిరొట్ట పైర్లు సరైన సమయంలో వేసి భూమిలో కలియదున్నటం వల్ల భాస్వరం, పొటాష్ అందటంతో తోపాటు గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడుతుంది. భూసారం పెంపుతోపాటు పంట ఉత్పత్తులు పెరుగుతాయన్నారు.

భూసారం పెరుగుతుంది..



పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూసారం పెరుగుతుంది. మాగాణి భూముల్లో జనుము, జీలుగ సాగుచేసి పూత వచ్చే వరకు పెంచి నేలలో కలియ దున్నటం వల్ల ఎకరాకు 5 ట్రక్కుల సేంద్రియ ఎరువు వేసినంత బలంతోపాటు ఆ తదుపరి వేసే పైర్లు ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడులను ఇస్తోంది.

– జీ. కోటేశ్వరరావు, ముక్తేశ్వరం

నాలుగేళ్లుగా పచ్చిరొట్ట పైర్లు సాగుచేస్తున్నా..



నాలుగేళ్లుగా ఖరీఫ్ ఆరంభంలో మాగాణి భూముల్లో పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగ పూతరాగానే భూమిలో కలియదున్నుతున్నాం. పిల్లిపెసర పశుగ్రాసంగా వినియోగించటం వల్ల దిగుబడి పెరుగుతోంది. సబ్సిడీపై విత్తనాలు అందించటం వల్ల మాకు మేలు కలుగుతుంది.

– కె. శివారెడ్డి, సూరేపల్లి

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి మూలవిరాట్

యద్దనపూడి: పూనూరు గ్రామంలో కొలువై ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రతి ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అర్చకులు దీవి భావనాచార్యుల ఆధ్వర్యంలో ధ్వజాపక ఆరాధన, ధ్వజారోహణం, ధ్వజపూజ, భేరిపూజ, సంప్రోక్షణ హోమాలు నిర్వహించారు. తదుపరి స్వామివారి మూలవిరాట్‌లకు సుప్రభాత సేవలు, పంచామృతాభిషేకాలు, విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వేదాధ్యయనం, హోమాలు, నిర్వహించి స్వామివారి మూలవరులకు సువర్ణ, రత్నాభరణ అలంకారం, విశేషపూలంగి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సాయత్రం 5 గంటలకు ఉత్సవ మూర్తులను పసిడి, రజిత ఆభరణాలతో, పుష్పాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ముమ్మారు గర్భగుడి ప్రదక్షిణ చేయించి ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. కల్యాణ వేదికపై తన ఉభయదేవేరులతో కలిసి స్వామివారు ముగ్ధ మనోహరంగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వేదమంత్రాలు, సుమంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామివారి కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. ఈ కల్యాణ క్రతువును నారాయణం పవన్‌కుమార్, నారాయణం శ్రీనివాసాచార్యులు, నారాయణం మనోజ్ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం ఆలయ ఈఓ మల్లవరపు నాగయ్య స్వామివార్లకు తలంబ్రాలు, తాళిబొట్టు, కల్యాణవస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలను, తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తన్మయత్వంతో స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.


విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం

ఉపాధి కల్పనలో అధికారుల నిర్లక్ష్యం

అద్దంకి: వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు మండిపడ్డారు. ఉపాధి హామీ పథక పనుల పరిశీలన పర్యటనలో భాగంగా గురువారం మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో ఉపాధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ మార్పు పేరుతో వ్యవసాయ కార్మికులకు పనులు లేకుండా చేయడం సమంజసం కాదన్నారు. సంవత్సరంలో వంద రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉండగా 60 నుంచి 70 రోజులే పనులు కల్పిస్తున్నారన్నారు. రోజు వేతం రూ.300 ఇవ్వాల్సి ఉండగా అరకొర వేతనాలు ఇస్తున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా మేల్కొని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే వేతనాలు ఖాతాలకు జమ చేయని పక్షంలో కార్మికులందరికీ ఏకం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


కార్మికులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు వెంకటేశ్వర్లు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని దేవాంగపురి గ్రామ పంచాయతీ సెక్రటరీ, ఈవోఆర్డీ మురళీబాపూజీ సూచించారు. గురువారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గుమ్మస్తాల కాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. సెక్రటరీ వెంట పంచాయితీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

చీరాల టౌన్: గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీఎల్‌పీవో దారా హనుమంతరావు సూచించారు. గురువారం మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ కార్యాలయానికి డీఎల్‌పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీకి చెందిన పలు రికార్డులను, పెండింగ్ అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో ఉద్యోగులతో మాట్లాడుతూ పంచాయతీలో విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలన్నారు. విధుల్లో అశ్రద్ధ వహించినా, ప్రజా సమస్యలను పట్టించుకోని వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.


సిబ్బందికి సూచనలందిస్తున్న డీఎల్‌పీవో

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

యద్దనపూడి: మండలంలోని అనంతవరం హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దివంగత మద్దినేని బ్రహ్మనందం, శంకుతల జ్ఞాపకార్థం వారి కుమారుడు జమరామకృష్ణ విద్యార్థులకు రూ.10 వేలు విలువైన నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఎంఈఓ–2 చిలుకూరి గోపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు పోపూరి నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ, ఉపాధ్యాయులు వీరాంజనేయులు, గుదే సుబ్బారావు, మద్దినేని శ్రీనివాసరావు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో మెలగాలి

వేటపాలెం: రెవెన్యూ డే వేడుకలను గురువారం మండల తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని తహశీల్దార్ పరాశరం కృష్ణకాంత్ కేక్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సేవలను సత్వరం అందించి ప్రజలకు బాసటగా నిలవాలన్నారు. ప్రభుత్వంలో కీలకమైన రెవెన్యూ శాఖ నిత్యం ప్రజలతో సస్సంబంధాలు కలిగి ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రెవెన్యూ సేవలు అందించాలన్నారు. ఉద్యోగులు అంకితభావంతో, సమర్థవంతంగా విధులు నిర్వహించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.శివరామిరెడ్డి, డేగల సత్యం, నెహెమ్యా, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రెవెన్యూ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠమాసం జ్యేష్ఠ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

21 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

మేదరమెట్ల: ఆర్ఎస్‌సీఏ అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మేదరమెట్ల –సోమవరప్పాడుల గ్రామంలో ఈ నెల 21 నుంచి మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కమిటీ పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.25,116, రూ.15,116, రూ. 10,116, రూ.5,116 వరుస బహుమతులుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9391160072, 7013800684, 6302552540 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

నక్కబొక్కలపాడులో పోలేరమ్మ కొలుపులు

బల్లికురవ: గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని నక్కబొక్కలపాడులో పోలేరమ్మ కొలుపులు చేపట్టారు. ఘటంతో గురువారం ఇంటింటి చద్ది సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నుంచి కొలుపుల కార్యక్రమానికి అంకురార్పణతో గురువారంతో ముగియనున్నాయని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. శుక్రవారం కొలుపుల ముగింపులో భాగంగా అన్న సంతర్పణ చేపట్టనున్నట్లు తెలిపారు. సుమారు ఐదు దశాబ్దాల తరువాత గ్రామంలో పోలేరమ్మ కొలుపులు జరుగుతుండటంతో వివిధ ప్రాంతాలకు వ్యవసాయ పనులకు వెళ్లిన కుటుంబాల వారు గ్రామానికి రావడంతో ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం నెలకొంది.

భూసార పరీక్షలు చేయించుకోండి

బల్లికురవ: భూమిలో ఉన్న లోపాలను కనుగొనేందుకు రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. గురువారం మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల పరిధిలో భూసార పరీక్షలు చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ వీఏఏల ద్వారా చేపట్టారు. ఒక్కో రైతు భరోసా కేంద్రం పరిధిలో 40 మంది రైతులకు సంబంధించి భూసార పరీక్షల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టి పరీక్షలు చేయించాలి

అద్దంకి: మండలంలోని రామాయపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రం వద్ద మట్టి పరీక్షలు చేస్తామని ఏఏవో కాజాబీ గురువారం ఒక ప్రకటనతో తెలిపారు. రామాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో మట్టి పరీక్షలు చేయించుకోదలచిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య సిబ్బందికి యూనిఫాం అందజేత


ఆప్రాన్స్ అందించిందిన దాత

చినగంజాం (పర్చూరు): పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న 10 మంది వైద్య సిబ్బందికి పర్చూరు రోటరీ క్లబ్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు మెడికల్ యూనిఫాం (అప్రాన్స్) అందించారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుతూ కరోనా సమయంలో మంచి సేవలు అందించిన 10 మంది సిబ్బందికి ఉచితంగా పండ్లు కూడా అందించి గౌరవించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుకన్య, సౌమ్యశ్రీ, సింధూర, హెడ్ నర్స్ రత్నకుమారి, రోటరీ సభ్యులు కోట శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటు


ఉచిత పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మేదరమెట్ల: విద్యాభివృద్ధికి దాతలు తోడ్పాటు నివ్వడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు మన్నెం శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బి. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మొరవనేని శైలేశ్‌బాబు సాకారంతో రూ. 20వేలు విలువైన నోట్‌బుక్స్, ప్యాడ్స్, పలకలు, బుక్స్ కాపీ నోట్ బుక్స్ అందిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం నుంచి గ్రామ పెద్దల సహకారంతో పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం ఆటోను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మోరవనేని కోటేశ్‌బాబు, మామిళ్లపల్లి శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛ చీరాల లక్ష్యంగా పనిచేయాలి

చీరాల: స్వచ్ఛ చీరాలే లక్ష్యంగా సిబ్బంది పనితీరు ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. గురువారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించారు. తెల్లవారుఝామున గడియార స్తంభం వద్ద పారిశుద్ధ్య హాజరు పట్టికను పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటరీ సెక్రటరీలకు పారిశుద్ధ్యంపై పలు సూచనలు చేశారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ఆదేశించారు. అలానే స్వర్ణ గేటు వద్ద డ్రైనేజి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్‌లతో కలిసి డ్రైనేజీలను పరిశీలించారు. మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలానే పట్టణంలోని చిన్న పిల్లల పార్కును పరిశీలించారు. పార్కులో అమర్చేందుకు నూతనంగా వచ్చిన మెటీరియల్‌ను తనిఖీ చేశారు. పార్కులోని మిగిలిన ఆట వస్తువులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ ఐసయ్య, సిబ్బంది ఉన్నారు.


పార్కులోని ఆట వస్తువులను పరిశీలిస్తున్న కమిషనర్ చక్రవర్తి

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

కారంచేడు: రాబోయే 2047 సంవత్సరం నాటికి ప్రపంచ వ్యాప్తంగా సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలమే లక్ష్యంగా వైద్య, ఆరోగ్య శాఖ పనిచేస్తుందని, అందుకు తగినట్లుగా స్థానిక పీహెచ్‌సీల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని స్వర్ణ పీహెచ్‌సీ డాక్టర్ షాలిని అన్నారు. గురువారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రధానంగా ప్రభావితమయ్యే గిరిజన ప్రాంతాల్లో 0–40 ఏళ్ల మధ్య వయసున్న సుమారు 7 కోట్ల మంది ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించేలా కేంద్రప్రభుత్వం ఒక ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఏలా ఉంటాయో అని వివరించారు. రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లునొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా అంటువ్యాధులు రావడం, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ నష్టం (అంగవైకల్యం) వంటివి కనిపిస్తాయన్నారు. గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ఈ వ్యాధి లక్షణాలను అర్థమయ్యేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. డాక్టర్ హస్మప్రియ, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎంపీహెచ్ఈఓ నాగేశ్వరారవు, ఉపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


స్వర్ణలో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉపాధ్యాయులకు సత్కారం


చిన్న సాంబశివరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జె.పంగులూరు: ప్రతి ఉద్యోగీ పదవీ విరమణ పొందాల్సినదేనని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరి గిరిజ అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ, ఉద్యోగ విరమణ పొందిన సిరిగిరి చిన్న సాంబశివరావు, మిడిదొడ్డి చంద్రశేఖర రావు సన్మాన సభ గురువారం పంగులూరులలో జరిగింది. హెచ్ఎం గిరిజ మాట్లాడుతూ ఉపాధ్యయ వృతిలో ఉండి, ఉద్యోగ విరమణ చేయటం అంటే చాలా గొప్ప విషయం అన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకునే విధంగా చేయాలని కోరారు. అనంతరం ప్రజా కళాకారులు నందవరపు జాన్ సాహెబ్, ఉబ్బా కోటేశ్వరావు విద్యా గీతాలను ఆలపించారు. అనంతరం సిరిగిరి చిన్న సాంబశివరావు, మిడిదొడ్డి చంద్రశేఖర రావు దంపతులను ఘనంగా సత్కరించారు. బూదవాడ హై స్కూల్ హెచ్ఎం బంగారు కొండ, అలవలపాడు హెచ్ఎం స్వయంపు గోవిందరాజులు, నాగులుప్పలపాడు హెచ్ఎం రమణయ్య, ఉపాధ్యాయులు శ్రీగిరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ వెంకట సుబ్బారావు. చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలు అందిస్తేనే ప్రజల్లో గుర్తింపు


రిటైర్డ్ వీఆర్వో రంగనాయకులను సత్కరిస్తున్న ఉద్యోగులు


పంగులూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణప్రసాద్

చినగంజాం (పర్చూరు): రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని బాపట్ల ఆర్డీవో రవీందర్ పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. తమ వద్దకు పని కోసం వచ్చిన వారు సంతోషంగా వెళ్లాలని ఆయన ఉద్యోగస్తులను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1953లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణతో పాటు రెవెన్యూ బోర్డు ఏర్పడిందన్నారు. దాని స్థానంలో ప్రస్తుతం రెవెన్యూ కమిషనర్లు పనిచేస్తున్నట్లు ఆయన వివరించారు. ఉద్యోగ సమయంలో ప్రతిభ కనబరిచిన వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రిటైర్డ్ వీఆర్వో కె రంగనాయకులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పర్చూరు తహశీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, కారంచేడు తహసీల్దార్ మెహర్ బాబు, డీటీ నాగలక్ష్మి, ఎలక్షన్ డీటీ సూర్యనారాయణ, సీనియర్ సహాయకులు, వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

జే. పంగులూరు: రెవెన్యూ పరిపాలన వ్యవస్థలో గ్రామ రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమైందని, గ్రామ రెవెన్యూ అధికారులు 49 అధికార విధులు నిర్వహించాల్సి ఉంటుందని తహసీల్దార్ కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం రెవెన్యూ డే తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సంక్షేమం దృష్టిలో ఉంచుకొని పరిపాలన వ్యవస్థ అనేక రకాల మార్పులు జరిగాయన్నారు. జమిందారీ, జాగీర్దారీ, ఇనాందారీ వ్యవస్థలు రద్దు చేసిన భూమి దున్నే రైతులకు రైత్వారీ పట్టాలుగా ఇచ్చారన్నారు. గ్రామా పరిపాలన వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని వివరించారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న పెత్తందారి వ్యవస్థ (పట్వారీ) విధానం అన్నారు. ఆంధ్ర ప్రాంతంలో గ్రామాధికారాల వ్యవస్థ కరణం, మునసబు విధానం రద్దు అయిందన్నారు. 1992 నుంచి మండల వ్యవస్థలు, గ్రామ రెవెన్యూ వ్యస్థలు, గ్రామానికో రెవెన్యూ అధికారిని నియమించినట్లు చెప్పారు.